క్లుప్తంగా

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



మదనాపురం: మండల కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి గృహంలో ఎమ్మెల్యేతో పాటు నూతనంగా పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గజ్జల నాగన్న, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డె కృష్ణ, మాజీ ఎంపీటీసీ శరత్‌రెడ్డి, నాయకులు ఉప్పరి వెంకటన్న, సాయిబాబా, భాను తదితరులు ఉన్నారు.

వనపర్తి రూరల్: పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను పెబ్బేరు మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కలిసి శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా గౌడ సంఘం జేఏసీ చైర్మన్ మాలపల్లి రామన్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, బస్వరాజ్‌గౌడ్, దాసరి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలు పంపిణీ



పాన్‌గల్: విద్యార్థుల్లో రక్తహీనత నివారణ కోసమే ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు ఏఎన్ఎం సుమిత్ర అన్నారు. గురువారం మండలంలోని శాగాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, తీసుకోవాల్సిన పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటస్వామి, ఉపాధ్యాయ బృందం, ఆశా కార్యకర్త, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



వీపనగండ్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన రాణిని గురువారం సీపీఎం మండల నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమవంతు సహకారాన్ని అందిస్తామని మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, మండ్ల కృష్ణయ్య, సీహెచ్ వెంకటయ్య, రవి, వెంకటేశ్వర్లగౌడ్, గోపాల్, ఈశ్వర్ అన్నారు.

మహిళా కానిస్టేబుల్ మృతికి సంతాపం

వనపర్తి రూరల్: నార్జునసాగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా కానిస్టేబుల్ శ్రావణి (27) మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆమె స్వగ్రామం పెబ్బేరు మండలంలోని యాపర్లలో విషాదం చోటు చేసుకుంది. మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తీసుకురాగా స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి యాపర్లకు చేరుకుని శ్రావణి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట విక్రమ్‌గౌడ్, రాజు తదితరులు ఉన్నారు.

మొసలి దాడిలో పొట్టేలు మృతి



ఆత్మకూర్: మొసలి దాడిలో పొట్టేలు మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని మూలమళ్లలో చోటు చేసుకుంది. గ్రామ శివారులోని జూరాల ప్రధాన ఎడుమ కాల్వ సమీపంలోకి కాపరులు సాగర్, దేవన్న గొర్రెలను మేపేందుకు తీసుకెళ్లారు. కాల్వలోని మెట్ల వద్ద నీరు తాగుతున్న గొర్రెపై మొసలి దాడి చేయడంతో గమనించి కాపరులు కేకలు వేయడంతో పాటు రాళ్లతో కొట్టడంతో మొసలి నీటిలోకి వెళ్లిపోయిందని తెలిపారు. మొసలి దాడి చేయడంతో గొర్రె పిల్ల తీవ్రంగా గాయపడి మృత్యువాత పడిందని రూ.10 వేలు నష్టం వాటిల్లిందని గొర్రెల కాపర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వరకే మూలమళ్ల శివారులో మొసళ్ల దాడుల ఘటనలు పదుల సంఖ్యలో జరిగాయని, ఫారెస్టు అధికారులు స్పందించి మొసళ్లను పట్టుకెళ్లాలని రైతులు కోరుతున్నారు.

ఓటరు జాబితా సరిచేసుకోండి



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి



అమరచింతలో సమావేశానికి హాజరైన రాజకీయ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో తప్పొప్పులు ఉంటే రెండురోజుల్లోగా సవరణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారులు సూచించారు. గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఓటరు జాబితా సవరణపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశం నిర్వహించారు.

■ ఆత్మకూర్ మండలంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి నాయకులతో సమావేశం నిర్వహించారు.

■ అమరచింతలో ఎంపీడీఓ శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇదివరకే అన్ని పంచాయతీల వద్ద ఓటరు జాబితా అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, ఈసీ రఘు,నాయకులు రాజన్న, అబ్రహం, అజయ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

■ కొత్తకోట మండలంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రవీందర్‌బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించగా.. 24గ్రామ పంచాయతీ పరిధిలో 220 వార్డులకు సంబంధించిన ఓటర్ల జాబితాను ఈనెల 13న పంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డుపై ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచుపల్లియాదవ్, బీజేపీ నుంచి కోటేశ్వర్‌రెడ్డి, సీపీఎం నుంచి నిక్సన్ తదితరులు హాజరయ్యారు.



కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్

■ పెద్దమందడి మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 212 వార్డుల్లోని ఓటరు జాబితాలను పంచాయతీల వద్ద అందుబాటులో ఉంచామని ఎంపీడీఓ సద్గుణ తెలిపారు.

■ పాన్‌గల్‌లో ఎంపీడీఓ గోవింద్‌రావు మాట్లాడుతూ పంచాయతీల్లో అందుబాటులో ఉంచిన ఓటరు జాబితాలో ఏమైనా తప్పులుంటే వాటిని సరిచేసుకోవాలని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. సమావేశంలో డీటీ అశోక్‌నాయుడు, ఎంపీఓ రఘురాములు, సీనియర్ అసిస్టెంట్ వరమ్మ, రాజకీయ నాయకులు వెంకటయ్యానాయుడు, హైమావతి, బాల్యానాయక్ పాల్గొన్నారు.

■ శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రవినారాయణ ఆధ్వర్యంలో ఓటరు జాబితా అభ్యంతరాలపై నాయకులతో సమావేశం నిర్వహించారు.

■ వీపనగండ్ల తహసీల్దార్ వరలక్ష్మి మాట్లాడుతూ బీఎల్ఓలు ఓటరు జాబితాలో తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, బీఎల్ఓలు సుగుణాబాయి, సువర్ణ, ఎల్లమ్మ, పారిజాత, కృష్ణమ్మ, లక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకే..



మాట్లాడుతున్న జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

పాన్‌గల్: విద్యార్థుల్లో దాగిన క్రీడా ప్రతిభ గుర్తింపునకే ఎస్‌జీఎఫ్ క్రీడలను నిర్వహిస్తున్నామని జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఆయన మండల స్థాయి అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఆటల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలో మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవింద్‌రావు, మండల నోడల్ అధికారి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ హైమావతి, బాలుర, బాలికల పాఠశాలల హెచ్‌ఎంలు నరేందర్, విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు రాము యాదవ్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తెగిన కాల్వలకు మరమ్మతు ప్రారంభం



వీపనగండ్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పుల్గర్‌చర్ల సమీపంలో తెగిపోయిన భీమా కాల్వ మరమ్మతు పనులను గురువారం ప్రారంభించడంపై పుల్గర్‌చర్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాల్వ తెగిపోవడం వల్ల ఆయకట్టు పొలాలకు సాగు నీరు అందడం లేదన్న విషయాన్ని స్థానిక నాయకులు, రైతులు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరేష్, గురుక కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితులపై అధికారుల వేధింపులు తగవు



ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఆత్మకూర్: నిరుపేద దళితులపై అధికారుల వేధింపులు ఆపాలని దళిత, ప్రజాసంఘాల, సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్, ఎమ్మార్పీఎస్, డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్‌ల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళితుడైన లింగన్న తనసొంత జాగాలో గుడిసె వేసుకుని 40 ఏళ్లుగా జీవనం సాగిస్తుండగా.. ఆ స్థలం ఇతరులదని, ఖాళీ చేయాలంటు రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు వేధింపులకు గురి చేయడంపై మండిపడ్డారు. నిరుపేదలకు న్యాయం చేయాల్సిన అధికారులు పెత్తందార్లకు వత్తాసు పలుకుతుండడం విడ్డూరంగా ఉందని, వేధింపులు ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాజుకు అందజేశారు. కార్యక్రమంలో సోంబాబు, మాసన్న, జానకీరాములు, అజయ్, రవీందర్, రాబర్ట్, ప్రసాద్, రాజు, రవి, రాము, కృష్ణ, నాగేష్, కుర్మన్న, పాండు ఉన్నారు.

దిలీప్‌రెడ్డికి పరామర్శ



వనపర్తి రూరల్: పెబ్బేరు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి బుధవారం రాత్రి గుండెపోటుకు గురై హైదరాబాద్‌లోని మెడికోవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం ఆస్పత్రికి వెళ్లి దిలీప్‌రెడ్డిని పరామర్శించారు. ఒత్తిడి తగ్గించుకొని ఆరోగ్యంపై తగిన జాగ్రతలు తీసుకోవాలని మాజీ మంత్రి బాధితుడికి సూచించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

ఆరుగురిపై కేసు నమోదు

పాన్‌గల్: ఒకరిపై దాడి చేసిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు గురువారం పోలీసులు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలకృష్ణకు సర్వే నంబర్ 183, 182లో పట్టా భూమి ఉండగా.. అది కోర్టు వివాదంలో ఉంది. ఈనెల 15వ తేదీన ఇదే గ్రామానికి చెందిన గాడుదల పర్వ, గాడుదల సుకునమ్మ, గాడుదల నాగేషి, గాడుదల సూరి, రిక్కల తిరుమలేష్, కొట్ల రాముడు ఆ పొలంలోకి అక్రమంగా ప్రవేశించి ట్రాక్టర్‌తో దున్నుతుండగా వారిని బాలకృష్ణ వారించాడు. దీంతో ఆరుగురు కలిసి బాలకృష్ణను కింద పడేసి కొట్టడంతో పాటు తన భార్యను దూషించారని బాధితుడు ఈనెల 17న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం గురువారం ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 4వ వార్డులో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు స్థానిక కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు. పూజ అనంతరం అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో వినాయక చవితి జరుపుకోవాలని, ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనం చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, ఎస్‌జే బోయేజ్, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, గొల్లబాబు, మాసన్న, రాంలాల్‌నాయక్, మునగాల కృష్ణ, నవీన్‌రెడ్డి, రమేష్, సాయిరాం, శివ, అంజి, బాలు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన



వనపర్తి రూరల్: శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ మంజులారాణి ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమానికి ఎంపీఓ రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిరుధాన్యాలతోనే సంపూర్ణమైన ఆరోగ్యం ఇమిడి ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం కోసం మంచి పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి



చిన్నారులకు ఆర్థికసాయం అందిస్తున్న కాలనీవాసులు

అమరచింత: పట్టణంలోని బీసీ కాలనీలో నివాసముంటున్న లక్ష్మి (35) అనారోగ్యంతో మృతి చెందడంతో కాలనీవాసులు తమ వంతు ఆర్థికసాయం అందించారు. లక్ష్మి తన భర్త బోయ కుర్మన్నతో పాటు ఇద్దరు అమ్మయిలతో కలిసి కూలీ పనులు చేస్తు జీవనం గడుపుతున్నారు. ఐదేళ్ల క్రితం లక్ష్మి భర్త కుర్మన్నకు పక్షవాతంతో కాళ్లు, చేతులు చచ్చుబడ్డాయి. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న లక్ష్మికి సరైన వైద్యం అందకపోవడంతో గురువారం మృతి చెందింది. దీంతో ఆరో వార్డు కౌన్సిలర్ మాధవి, సురేష్‌తో పాటు ప్రముఖ జరిచీరల వ్యాపారి మహంకాళి శ్రీనివాస్ వ్యక్తిగతంగా రూ.పది వేల నగదు, కాలనీవాసులు చందాలు వేసుకొని బాధిత కుటుంబానికి రూ.60 వేల ఆర్థికసాయం అందించారు.

ఆర్థికసాయం అందజేత

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 6వ వార్డు మెట్టుపల్లిలో అనారోగ్యంతో రంగం నాగన్న మృతి చెందాడు. ఈ విషయాన్ని జిల్లా యూత్ సోషల్ మీడియా కన్వీనర్ నందిమల్ల చంద్రమౌళి ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచన మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ గురువారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని, దిగులు చెందొద్దని బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే పంపిన రూ. 5వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కిష్టన్న, చిన్నకృష్ణ, మన్యం, శాంతన్న, రెడ్యానాయక్, జయరాం, రవీంద్ర ఉన్నారు.

బోయి భీమన్నకు నివాళి

వనపర్తి టౌన్: బోయి భీమన్న చేసిన పోరాటాలు, రచించిన కవిత్వాలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్, ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. గురువారం పద్మభూషణ్, పద్మశ్రీ అందుకున్న డాక్టర్ బోయి భీమన్న జయంతిని పురస్కరించుకొని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు, గిరిరాజాచారి, నాయకంటి నరసింహశర్మ, మండ్ల దేవన్న నాయుడు, గంధం నాగరాజు, బాలేమియా, యోసోఫ్, పరమేశ్వర చారి మాధవచారి, సత్యం చారి తదితరులు పాల్గొన్నారు.

న్యాస్ పరీక్షలతో విద్యార్థుల ప్రతిభ గుర్తింపు



మాట్లాడుతున్న మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు

పాన్‌గల్: విద్యార్థుల సామర్థ్యాలు గుర్తింపునకు నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో న్యాస్, ఎఫ్ఎల్ఎన్ అంశాలపై ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తరగతి వారీగా అభ్యసన సామర్థ్యాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయా అంశాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎం నరేందర్, ఉపాధ్యాయ బృందం, సీఆర్పీలు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్య పట్టణంగా మార్చుకుందాం



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న మెప్మా కోఆర్డినేటర్, సిబ్బంది

అమరచింత: పట్టణాన్ని సంపూర్ణ పారిశుద్ధ్య పట్టణంగా మార్చుకుందామని మెప్మా కోఆర్డినేటర్ యువరాజు అన్నారు. పట్టణంలోని ఐదో వార్డులో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బందితో కలిసి రహదారులపై చెత్తను తొలగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల ఒకటో తేదీ వరకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలను పట్టణంలోని అన్ని వార్డుల్లో చేపడుతున్నామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. మురుగు నిల్వలతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిల్వ నీటి గుంతలను మట్టితో పూడ్చివేసేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆత్మకూర్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం స్వచ్ఛ భారత్–స్వచ్ఛ ఆత్మకూర్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతాహీ సేవా 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరణ పకడ్బందీగా చేయాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు.

'అభివృద్ధికి అడ్డుపడడం మానుకోవాలి'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఖిల్లాఘనపురం: మండలంలో జరుతున్న అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ నాయకులు అడ్డు చెప్పడం మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు వెంకటేశ్వర్‌రావు, గంజాయి రమేష్ సూచించారు. మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సామ్యానాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య తదితర బీఆర్ఎస్ నాయకులు బుధవారం విలేకరుల సమావేశం పెట్టి మండలంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి చేస్తున్న అభివృద్ధిపై ప్రజల దృష్టి మరల్చేందుకు విఫలయత్నం చేశారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ 2022లోనే మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఖిల్లాఘనపురం నుంచి కొత్తపల్లి తండా వరకు బీటీ రోడ్డు రినివల్‌కు రూ.6.60 కోట్ల నిధులు మంజూరు చేస్తే.. రెండేళ్లు పూర్తయినా ఎందుకు పనులు మొదలు పెట్టలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ఓర్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తాము చూస్తు ఊరుకోలేమన్నారు. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తాము ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా మంచి పనులకు అడ్డురాకుండా ఉంటే మండలాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామని కోరారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డితో నిధులు మంజూరు చేయిస్తామని చెప్పడం ఎంతవరకు కరెక్టు అవుతుందో తెలుసుకోవాలన్నారు. మీరు ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ క్యామ రాజు, నాయకులు బాలకృష్ణారెడ్డి, సతీష్‌కుమార్, ఆగారం ప్రకాష్, విజయలక్ష్మి, మునగాల బాబు, రాజునాయక్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలను పెంచండి



మాట్లాడుతున్న ఏఎంఓ మహానంది

అమరచింత: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సులభతర పద్ధతిలో బోధన అందించి వారిలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ఏఎంఓ మహానంది అన్నారు. మండల జెడ్పీఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎం విధానాన్ని అవలంబించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాల్లో ఉన్న విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. తరగతి గదిలో బోధన పరికరాలను ఉపాధ్యాయుడు వెంట తీసుకెళ్లాలని, వాటితోనే బోధన అందించాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రెటరీ చంద్రశేఖర్, ఎంఈఓ భాస్కర్‌సింగ్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.